సాక్షి సంగారెడ్డి



సర్కారు కొలువే లక్ష్యంగా..

సర్కారు కొలువు ఎందరో యువత జీవిత లక్ష్యం. ఆ ఆశయాన్ని సాధించాలనే లక్ష్యంతో కాలంతో పోటీ పడుతూ చదువులు సాగిస్తున్నారు. వివరాలు 8లో ▸



చెరువు కాలుష్యం..

సంగారెడ్డి పట్టణంలోని మహబూబ్‌సాగర్ చెరువులో కాలుష్య జలాలు, ఆక్సిజన్ లెవల్ పడిపోవడంతో చేపలు మృత్యువాత పడుతున్నాయి. వివరాలు 8లో ▸

నేడు బీఆర్‌ఎస్ ధర్నా

సంగారెడ్డి రూరల్ : అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ తెలిపారు. అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించాలని, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొనాలన్నారు.

న్యూస్‌రీల్

రైతు వేదికకు తాళం



దౌల్తాబాద్ రైతు వేదిక వద్ద నిరీక్షిస్తున్న రైతులు

హత్నూర(సంగారెడ్డి): మండలంలోని రైతు వేదికలకు బుధవారం తాళం వేసి ఉండటంతో రైతులు నిరీక్షించారు. రుణమాఫీ కాలేదని దౌల్తాబాద్ క్లస్టర్ పరిధిలోని రైతులు దరఖాస్తు చేసుకోవడానికి కాసాల రైతు వేదిక కేంద్రానికి వచ్చారు. అప్పటికే రైతు వేదికకు తాళం వేసి ఉండటంతో అధికారులకు ఫోన్ చేస్తే రెండు రోజుల తర్వాత రండి అంటూ చెప్పారన్నారు. నస్తీపూర్, కాసాల, బోర్పట్ల, పల్పనూర్ గ్రామాలకు చెందిన రైతులు ఇక్కడికి వస్తారన్నారు. ప్రభుత్వం ఇబ్బందులు పెట్టకుండా ఆయా గ్రామాల్లోనే దరఖాస్తులు తీసుకునే వెసులుబాటు కల్పించాలని కోరారు.

వన సంపదను రక్షించాలి

– విజిలెన్స్ డీఎఫ్‌ఓ వెంకటేశ్వర్లు



మొక్కలు పరిశీలిస్తున్న విజిలెన్స్ డీఎఫ్‌ఓ వెంకటేశ్వర్లు

కల్హేర్(నారాయణఖేడ్): వన సంపదన కాపాడేందుకు అధికారులు బాధ్యతగా పనిచేయాలని విజిలెన్స్ డీఎఫ్ఓ వెంకటేశ్వర్లు సూచించారు. బుధవారం సిర్గాపూర్ మండలం సుల్తానాబాద్‌లో గత ఏడాది నాటిన మొక్కలు పరిశీలించారు. వాటి సంరక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెంపకం బాగుందని సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏపీడీ రాజు, ప్లాంటేషన్ మేనేజర్ మణికుమార్, ఎంపీడీఓ మల్సూర్, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్‌లో అంతర పంటలు లాభదాయకం



గోటిగార్‌పల్లిలో బొప్పాయి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ భిక్షపతి

జహీరాబాద్ టౌన్: ఆయిల్ పామ్‌లో అంతర పంటల సాగుతో అధిక లాభం పొందొచ్చని వ్యవసాయ శాఖ జహీరాబాద్ డివిజన్ ఏడీఏ భిక్షపతి పేర్కొన్నారు. మొగుడంపల్లి మండలం గోటిగార్‌పల్లి గ్రామ రైతు నారాయణ 9 ఎకరాల్లో ఆయిల్ పామ్‌లో అంతర పంటగా బొప్పాయి సాగు చేస్తున్నారు. బుధవారం ఏడీఏ గ్రామాన్ని సందర్శించి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలను అందిస్తోందన్నారు. పంట నాలుగు సంవత్సరంలో దిగుబడి వస్తుందని, 30 సంవత్సరాలు ప్రతి నెలా స్థిరమైన ఆదాయం వస్తోందని చెప్పారు. మొదటి నాలుగైదు సంవత్సరాల పాటు పొలం ఖాళీగా ఉంచకుండా అంతర పంటగా బొప్పాయి, వేరుశనగ, మిర్చి, పుచ్చకాయ, అరటి, కూరగాయలు సాగు చేసుకోవచ్చన్నారు.

మాల మహానాడు ధర్నా



రాస్తారోకోలో సంఘాల నాయకులు

జహీరాబాద్: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ మాలమహానాడు నాయకుల ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. బుధవారం పట్టణంలోని 65వ జాతీయ రహదారిపై గల అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి, మాలమహానాడు సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించి రాస్తారోకో చేపట్టారు. ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని, ఆర్టికల్ 341కు వ్యతిరేకమని ఆందోళనకారులు పేర్కొన్నారు. దేశంలోని అన్ని ఎస్సీ, ఎస్టీ సంఘాలు, రాజకీయ పార్టీలు వ్యతిరేకిస్తున్నాయన్నారు. రిజర్వేషన్ బచావో సంఘర్షణ సమితి, బీఎస్పీ, లోక్‌జనశక్తి, రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా పార్టీలు వర్గీకరణను వ్యతిరేకిస్తున్నాయన్నారు. వెంటనే ఎస్సీ వర్గీకరణ క్రిమిలేయర్‌ను ఉపసంహరించుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు ఆకాశ్, సమతా సైనిక్ నాయకులు కర్ణ, రవికుమార్, కేపీఎస్ నాయకులు మహేశ్, ఆయా ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సింగూరులోకి ఇన్‌ఫ్లో

సింగూరు ప్రాజెక్టుకు వరద వచ్చి చేరుతోంది. నాలుగైదు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో పరివాహక ప్రాంతం నుంచి నీరు వస్తుంది. బుధవారం ప్రాజెక్టులోకి 1745 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో చేరిందని నీటి పారుదల శాఖ ఏఈ మహిపాల్ రెడ్డి తెలిపారు. ప్రాజెక్టు సామర్థ్యం 29.9 టీఎంసీలు కాగా ప్రస్తుతం 15.088 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

పుల్‌కల్(అందోల్):

కు.ని. పేరిట నొక్కేశారు!

శునకాల సర్వేతో సంగారెడ్డి మున్సిపాలిటీలో వెలుగుచూసిన అక్రమాలు

- కుక్కకు రూ.1,299 చొప్పున రూ.92 లక్షలకుపైగా డ్రా
- స్టెరిలైజేషన్ చేయకుండానే చేసినట్లు రికార్డులు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : అవినీతి, అక్రమాల్లో ఆరితేరిన సంగారెడ్డి మున్సిపల్ అధికారులు, పాలకవర్గంలోని కొందరు కీలక ప్రజాప్రతినిధులు కలిసి అందినకాడికి దండుకుంటున్నారు. పారిశుద్ధ్య కార్మికుల పేరుతో తమ బంధువులను ప్రతినెలా జీతభత్యాలు డ్రా చేసిన పాలకవర్గం నేతలు చివరకు కుక్కలను కూడా తమ అక్రమాలకు వాడుకున్నారు. వాటితో పట్టణ వాసులు అనేక ఇబ్బందులు పడుతుంటే, వారు మాత్రం అందిన కాడికి దండుకున్నారు. ఈ స్టెరిలైజేషన్ బాధ్యతలను ఓ కాంట్రాక్టు కంపెనీకి అప్పగించి బిల్లులు డ్రా చేశారు.

స్టెరిలైజేషన్‌తో పాటు, వ్యాక్సిన్ వేయించాలి..

నిబంధనల ప్రకారం ఈ కాంట్రాక్టర్ పట్టణంలో ఉన్న కుక్కలను పట్టుకుని వాటిని కుక్కల వ్యాన్‌లో ఎనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌కు తరలించి అక్కడ వాటికి స్టెరిలైజేషన్ ప్రక్రియ నిర్వహించాలి. అనంతరం వాటికి యాంటిరేబిస్ వ్యాక్సినేషన్ వేయించాలి. ఈ క్రమంలో కుక్కలకు తిండి కూడా పెట్టాలి. కానీ స్టెరిలైజేషన్ వ్యాక్సినేషన్ చేయించకుండానే, వాటికి తిండి కూడా పెట్టకుండానే బిల్లులు డ్రా చేశారు. మొక్కుబడిగా కొన్నింటికి ఈ ప్రక్రియ చేసి, అందిన కాడికి బిల్లులు దండుకున్నట్లు స్పష్టమవుతోంది.

ఏ వీధి చూసినా సమూహాలు

సంగారెడ్డి పట్టణంలో ఏ వీధిలో చూసిన కుక్కల మందలు దర్శనమిస్తున్నాయి. ఒక్కో మందలో పది పన్నెండు కుక్కలు ఉంటున్నాయి. ఈ కుక్కల మందలను చూసి స్థానికులు హడలిపోతున్నారు. ఎక్కడ తమపై దాడికి పాల్పడుతాయోనని ఆందోళన చెందుతున్నారు. తమ చిన్న పిల్లలను బయటకు పంపాలంటేనే భయపడుతున్నారు. ఇలా వాటితో పట్టణ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే అక్రమార్కులు మాత్రం తమ చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు.

- కుక్కల బెడద నివారణ చర్యల్లో భాగంగా వాటికి పునరుత్పత్తి జరగకుండా స్టెరిలైజేషన్ (కు.ని.ఆపరేషన్ల మాదిరిగా) చేస్తుంటారు. సంగారెడ్డి పట్టణంలో ఏటా కుక్కలకు స్టెరిలైజేషన్ చేయించామని చెప్పి ఏకంగా సుమారు రూ.92 లక్షలకు పైగా నిధులు డ్రా చేశారు. ఒక్కో కుక్కకు రూ.1,299 చొప్పున.. 2021 నుంచి 2024 మే వరకు మొత్తం 7,102 శునకాలకు స్టెరిలైజేషన్ చేయించినట్లు రికార్డుల్లో ఉన్నాయి. ఇప్పుడు ప్రభుత్వ ఆదేశాల మేరకు కుక్కల సర్వే జరుగుతోంది. ఈ స్టెరిలైజేషన్ చేయని కుక్కలు సంగారెడ్డిలో 4,960 వరకు ఉన్నట్లు తేలింది. ఈ సర్వే ఇంకా సగం కూడా పూర్తి కాలేదు. దీన్ని బట్టి చూస్తే స్టెరిలైజేషన్ చేయకుండానే చేసినట్లు బిల్లులు లేపినట్లు స్పష్టమవుతోంది.

- సంగారెడ్డి పట్టణంలో శాంతినగర్‌లో ఓ ఇంటి ఎదుట ఆడుకుంటున్న మూడేళ్ల బాలుడిపై గత నెల 9న కుక్కలు ఒక్కసారిగా దాడి చేశాయి. ఆ బాలుడు తీవ్ర గాయాల పాలయ్యాడు. బాలుడి అరుపులు విని చుట్టుపక్కల వారు వచ్చి దాడి చేస్తున్న కుక్కలను తరిమివేయకపోతే ప్రాణాలకే ప్రమాదం ఉండేది.
- అంతకు రెండు రోజుల ముందు 12వ వార్డులోనూ ఓ చిన్నారిపై దాడి చేశాయి. అక్కడే ఉన్న స్థానికులు కుక్కలను తరిమి బాలుడికి రక్షించారు. తర్వాత ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు.



నేను కొత్తగా వచ్చా

కమిషనర్‌గా నేను కొన్ని నెలల క్రితమే బాధ్యతలు తీసుకున్నా. గతంలో ఏం జరిగిందో తెలియదు. నేను బాధ్యతలు తీసుకున్నాక పకడ్బందీగా స్టెరిలైజేషన్ చేయిస్తున్నా. అంతకు ముందు ఏం జరిగిందో తెలుసుకుని చర్యలు తీసుకుంటా.

: ప్రసాద్ ఎస్‌సీవీకే చౌహాన్, మున్సిపల్ కమిషనర్, సంగారెడ్డి

దాశరథి సాహిత్యం నిరుపమానం



ప్రసంగిస్తున్న సుద్దాల అశోక్‌తేజ

సినీగేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ

సంగారెడ్డి ఎడ్యుకేషన్: నవయుగ వైతాళికుడు దాశరథి నేటి యువతకు స్ఫూర్తి అని, ఆయన సాహిత్యం నిరుపమానమైనదని సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ కొనియాడారు. బుధవారం సంగారెడ్డి పట్టణంలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సాహిత్య అకాడమీ మహాకవి దాశరథి కృష్ణమాచార్యుల శత జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా ఆయన విచ్చేసి ప్రసంగించారు. నిజాం ప్రభుత్వం ద్వారా శిక్షించబడి అనంతర కాలంలో స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దాశరథిని ఆస్థాన కవిగా చేసి ప్రభుత్వం గౌరవించిందని గుర్తుచేశారు. అనంతరం తెలుగు సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ బాలాచారి మాట్లాడుతూ దాశరథి శతజయంతిని పురస్కరించుకొని రాష్ట్రవ్యాప్తంగా వివిధ విశ్వవిద్యాలయాలు-కళాశాలలలో 'దాశరథి జీవితం – సాహిత్యం పై సమాలోచనలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ సభలో ఆత్మీయ అతిథిగా డాక్టర్ శంకరం ప్రసంగిస్తూ ఆకాశవాణిలో తాను దాశరథి ఒక కార్యక్రమంలో కలిసి పాల్గొన్నామని గుర్తుచేసుకున్నారు. అనంతరం సుద్దాల అశోక్ తేజను కళాశాల అధ్యాపక బృందం ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో తారా కళాశాల ప్రిన్సిపాల్ కేఎస్ రత్నప్రసాద్, అతిథులు మహంతయ్య , డా.శ్రీనివాస రావు, డా.సుమతీదేవి, డా.అరుణా బాయి, డా.శ్రీనివాస్, రాపోలు సుదర్శన్, తిరుపాల్‌తో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇక్రిశాట్‌లో వింత చేపలు



ఇక్రిశాట్ ప్రాంగణంలోని రోడ్డుపై వింత చేపలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణ పరిధిలోని ఇక్రిశాట్ ప్రాంగణంలోని రోడ్డుపై వింత చేపలు చూపరులను అబ్బుర పరుస్తున్నాయి. ఆకాశం నుంచి వర్షంతో పాటు పడిన ట్లుగా స్థానికులు చెబుతున్నారు. మంగళవారం సాయంత్రం వర్షం కురియడం తెలిసిందే. కొందరేమో వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టగా ఇవి వైరల్‌గా మారాయి.

డొనేషన్ల దందా అరికట్టండి

కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం



మాట్లాడుతున్న మాణిక్యం

సంగారెడ్డి ఎడ్యుకేషన్: ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీ యాజమాన్యాలు పెద్ద ఎత్తున డొనేషన్‌లు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్నాయని, వాటిపై చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం డిమాండ్ చేశారు. బుధవారం సంగారెడ్డిలో కేవీపీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాణిక్యం మాట్లాడుతూ, ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీ మేనేజ్మెంట్ కోటా సీటు కోసం ప్రతీ విద్యార్థి నుంచి రూ.10 లక్షల నుంచి రూ 20 లక్షల వరకు అక్రమంగా డొనేషన్లు, ట్యూషన్ ఫీజు లక్షల్లో వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రతీ సంవత్సరం 25% ఫీజుల పెంపుతో పాటు హాస్టల్, అడ్మిషన్ ఫీజుల పేరుతో వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను యాజమాన్యాలు దోపిడీ చేస్తున్నాయని మండిపడ్డారు. విద్య పూర్తిగా వ్యాపారమైపోయిందన్నారు. దీంతో పేద విద్యార్థులకు ఇంజినీరింగ్ విద్య అందని ద్రాక్షలా మారిందన్నారు. అక్రమంగా డొనేషన్లు వసూలు చేస్తున కాలేజీ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని, అటువంటి కాలేజీలను బ్లాక్ లిస్టులో పెట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అశోక్ జిల్లా ఉపాధ్యక్షుడు మద్దూరి శివకుమార్, మల్లేశం జిల్లా సహాయ కార్యదర్శులు ప్రవీణ్, దాస్ జిల్లా కమిటీ సభ్యులు దత్తు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రులు దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ, చిత్రంలో మెదక్, జహీరాబాద్ ఎంపీలు రఘునందన్‌రావు, సురేశ్ షెట్కార్, కలెక్టర్ క్రాంతి

రెండు నెలలకోసారి సమీక్ష

ఆరు గ్యారంటీలపై మంత్రులు దామోదర, కొండా సురేఖ

- డ్రగ్స్‌పై ఉక్కుపాదం
- అక్రమ మైనింగ్ అడ్డుకట్టకు టాస్క్‌ఫోర్స్
- ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అధికారులకు ఆదేశం



క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న మంత్రులు దామోదర, సురేఖ, కలెక్టర్ క్రాంతి తదితరులు

సంగారెడ్డి జోన్: డ్రగ్స్ మాఫియాను రూపుమాపేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, దేవాదాయ అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ వెల్లడించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ల చైర్మన్‌లు, జిల్లా అధికారులు, కలెక్టర్ క్రాంతితో కలిసి వారు ప్రభుత్వ పథకాల అమలు తీరు, సీజనల్ వ్యాధులు, భూ సేకరణ, భూ పరిరక్షణ, వైద్యం, ఆరోగ్యం, విద్యుత్‌తో పాటు వివిధ అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా దామోదర మాట్లాడారు. జిల్లాలో సంపద పెరిగిందని, భూముల విలువలు పెరిగాయని వెల్లడించారు. అక్రమ మైనింగ్‌పై ఉక్కుపాదం మోపుతోందన్నారు. అధికారులు బాధ్యతగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు అయ్యిందని చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు, ప్రజలకు చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆరు గ్యారంటీల అమలుకు ప్రతి రెండు నెలలకోసారి సమీక్ష నిర్వహించి, ప్రజలకు చేరుతున్న పథకాలు, అందించాల్సిన పథకాలపై సమీక్షించాలన్నారు. అక్రమ మైనింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, అందుకు టాస్క్ ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అక్రమ మైనింగ్ తో పాటు ప్రభుత్వ భూములు, దేవాదాయ భూములు పరిరక్షించాలని సూచించారు. ప్రభుత్వం మైనింగ్, ఇరిగేషన్, రెవెన్యూ, విద్యుత్ తదితర శాఖలకు సుపీరియల్ పవర్స్ అందిస్తామన్నారు. వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పనితీరుపై నిరంతర నిఘా ఏర్పాటు చేసినట్లు, రోగులకు మెరుగైన సేవలు అందించాలని తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించి, అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

అనంతరం మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, దేవాదాయ శాఖ పరిధిలో ఉన్న భూములు ఆక్రమణకు గురికాకుండా చూడాలని అధికారులకు సూచించారు. దేవాలయాల భూములలో దేవాలయాలకు ఉపయోగపడే మొక్కలు నాటించాలన్నారు. దేవాదాయ భూములకు సర్వేలు చేసి, హద్దు బందులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అధికారులు జవాబుదారితనంతో విధులు నిర్వహించాలని వెల్లడించారు. తొలుత కలెక్టరేట్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన క్యాంటీన్ ప్రారంభించారు. ఇందిరా మహిళా శక్తి రుణాల చెక్కులను పంపిణీ చేశారు. సమావేశంలో ఎంపీలు సురేశ్ షెట్కార్, రఘునందన్, ఎమ్మెల్యేలు సంజీవరెడ్డి, చింతా ప్రభాకర్, మాణిక్‌రావు, ఎమ్మెల్సీ యాదవ్ రెడ్డి, కార్పొరేషన్ల చైర్మన్లు నిర్మల, గిరిధర్ రెడ్డి, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి, ఎస్పీ చెన్నూరి రూపేశ్, ట్రైనీ కలెక్టర్ మనోజ్, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

హైడ్రా తరహా కమిటీలను వేయాలి

మెదక్ ఎంపీ రఘునందన్



మీడియాతో మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్ రావు

సంగారెడ్డి జోన్: జిల్లాలోని దేవాలయాల భూములు ఆక్రమణలకు గురవుతున్నాయని, వాటిని పరిరక్షించేందుకు హైడ్రా లాంటి కమిటీలను ఏర్పాటు చేసి భూములను పరిరక్షించాలని మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు రుణమాఫీ అర్హులైన ప్రతీ రైతుకు అందేలా చూడాలన్నారు. ఇలాంటి షరతులు లేకుండా రూ.2 లక్షల లోపు ఉన్న రుణాలు వివరాలు బ్యాంకు నుంచి తీసుకొని వెంటనే మాఫీ చేయాలన్నారు. హైదరాబాద్ పేరుతో ప్రతిపక్ష ఎమ్మెల్యే, ఎంపీలను టార్గెట్ చేయొద్దన్నారు. సుప్రీంకోర్టు నిబంధనల మేరకు చెరువులు, శిఖం, బఫర్ జోన్లలో ఎవరూ నిర్మాణాలు చేపట్టినా 24 గంటలు కూల్చివేయాలని డిమాండ్ చేశారు. భూ సేకరణ చేసే ముందు కలెక్టర్లు.. రిజిస్ట్రేషన్ వ్యాల్యూ పెంచి రైతులకు న్యాయం చేసేలా చూడాలన్నారు. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు 15 ఆగస్టు లోపు ప్రభుత్వం రుణమాఫీ చేస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని చెప్పినట్లు గుర్తు చేశారు. అంతేకాకుండా ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఏదైనా ఒక గ్రామానికి వచ్చి రుణమాఫీ జరిగిందని నిరూపించుకోవాలని డిమాండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ నుంచి ఏ మంత్రి అయినా సరే సిద్దిపేట జిల్లాలోని ఏదైనా ఒక గ్రామానికి వచ్చి రుణమాఫీపై చర్చించాలన్నారు. రుణమాఫీ జరిగినట్లు రుజువైతే, అక్కడే హరీశ్ రాజీనామా చేసి ప్రజల పక్షాన పోరాడాలని సూచన చేశారు.

పండ్ల తోటలకు.. ప్రోత్సాహం

- ఈ ఏడాది లక్ష్యం 1,250 ఎకరాలు
- ఈజీఎస్ కింద పెంపకందారులకు మొక్కల పంపిణీ
- పోషణ ఖర్చులు సైతం చెల్లింపు



నారాయణఖేడ్‌లో మామిడి మొక్కలు నాటుతున్న రైతులు

రాయికోడ్(అందోల్): జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సాహం లభిస్తోంది. రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నారు. ఆ మేరకు అవగాహన కల్పిస్తున్నారు. పథకంలో భాగంగా మామిడి, జామ, నిమ్మ, బత్తాయి, సపోట, సీతాఫల్, దానిమ్మ తదితర మొక్కలతో పాటు, కొబ్బరి మొక్కలు కూడా ఈజీఎస్ ద్వారా ఉచితంగా రైతులకు అందిస్తారు. మొక్కలు నాటేందుకు అవసరమయ్యే గుంతలతీత ఖర్చులతో పాటు పోషణ ఖర్చులు సైతం చెల్లిస్తారు. గతేడాది అధికంగా కల్హేర్, కంగ్టి మండలాల్లో పండ్ల తోటల పెంపకం చేపట్టారు.

లక్ష్యం ఇది..

జిల్లాలోని ఈ ఏడాది 1,250 ఎకరాల్లో మామిడి తోటల పెంపకాన్ని చేపట్టాలని అధికారులు లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. ఇప్పటి వరకు 770 ఎకరాల్లో మామిడి మొక్కలు నాటుకునేందుకు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మామిడి తోటల పెంపకంపై రైతులు ఆసక్తి చూపుతున్నారని అధికారులు తెలిపారు.

దరఖాస్తు చేసుకోవడం ఇలా..

పండ్ల తోటల పెంపకం కోసం చిన్న, సన్నకారు రైతులకు ప్రాధాన్యమిస్తారు. ఈజీఎస్ జాబ్ కార్డు, భూ పట్టా పాస్‌పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ పత్రాలను ఈజీఎస్ కార్యాలయంలో సమర్పిస్తే అధికారులు మంజూరు కోసం ప్రతిపాదిస్తారు. వివిధ రకాల పండ్ల మొక్కలను అందిజేస్తారు. పోషణ ఖర్చులను నిర్ణత కాలం పాటు రైతులకు చెల్లిస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి



ఉపాధిలో భాగంగా పండ్ల తోటలను పెంచుకునే అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. తోటల పెంపకంపై అవగాహన కల్పిస్తున్నాం. రైతులకు ఎలాంటి ఖర్చులు లేకుండా ఉచితంగా మొక్కలను అందించి, నాటించి, పోషణ ఖర్చులు పథకంలో భాగంగా చెల్లిస్తాం. ఆసక్తి కలిగిన రైతులు పండ్ల తోటల పెంపకం కోసం దరఖాస్తు చేసుకోవాలి.

– మణికుమార్, సంగారెడ్డి జిల్లా ప్లాంటేషన్ మేనేజర్

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు గంగారం విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కొండాపూర్(సంగారెడ్డి): మండల పరిధిలోని గంగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పండరినాయక్ తెలిపారు. జిల్లా స్థాయి యోగా పోటీలు 17వ తేదీన జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో జరిగాయి. ఈ పోటీల్లో జిల్లా నుంచి రాష్ట్ర స్థాయికి 42 మంది విద్యార్థులు ఎంపిక కాగా వీరిలో తొమ్మిది మంది గంగారం పాఠశాలకు చెందిన వారే కావడం విశేషం. విద్యార్థులను బుధవారం ఉపాధ్యాయ బృందం ఘనంగా సత్కరించింది. రాష్ట్ర స్థాయిలోనూ అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయికి ఎంపిక కావాలని ప్రధానోపాధ్యాయులు ఆకాంక్షించారు. ఇదిలా ఉండగా రాష్ట్ర స్థాయి పోటీలు అక్టోబర్ 3,4,5 తేదీల్లో జరగనున్నాయి.

యువతి కిడ్నాప్
– రక్షించిన పోలీసులు


యువకుడితో పోలీసులు

మద్దూరు(హుస్నాబాద్): హైదరాబాద్ కూకట్‌పల్లిలో కిడ్నాప్ అయిన యువతిని ధూల్మిట్ట మండలంలోని లింగాపూర్ గ్రామ పరిధిలోని జెల్లగూడంలో మద్దూరు పోలీసులు కాపాడారు. సీఐ శ్రీను కథనం మేరకు.. హన్మకొండ జిల్లాకు చెందిన నాలీబాల శిరీష(23)ని ములుగు జిల్లాకు చెందిన తీగల రాజశేఖర్‌రెడ్డి(30) మాయమాటలు చెప్పి కిడ్నాప్ చేసి జెల్లగూడంకు మంగళవారం తీసుకొచ్చాడు. రాజశేఖర్ రెడ్డి ప్రవర్తనలో మార్పు గమనించిన యువతి బుధవారం ఉదయం 7 గంటలకు డయల్ 100కి కాల్ చేసి తాను కిడ్నాప్‌కు గురయ్యానని తెలిపింది. స్పందించిన ఎస్ఐ షేక్ మహబూబ్, ఏఎస్ఐ జగదీశ్వర్ హుటాహుటినా గ్రామానికి వెళ్లి ఇరువురిని పోలీసు స్టేషన్‌కు తరలించారు. విచారణలో యువతిపై కూకట్‌పల్లిలో పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైనట్లు తెలుసుకున్నారు. కాగా యువతీ, యువకుడు కూకట్‌పల్లిలోని ఆస్పిరో ఫార్మాసిటికల్స్ కంపెనీలో పని చేస్తున్నారు. అమ్మాయిని కాపాడిన ఎస్ఐ, ఏఎస్ఐలను సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ అభినందించారు.

ఎంపీడీఓ కార్యాలయంలో పాము కలకలం


పామును చంపిన సిబ్బంది

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల కేంద్రమైన చిలప్‌చెడ్ ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం పాము కలకలం సృష్టించింది. వివరాల్లోకి వెళ్తే.. ముదిరాజ్ సంఘం భవనంలో కొనసాగుతున్న ఎంపీడీఓ కార్యాలయంలో సిబ్బంది పనిలో నిమగ్నమై ఉండగా ఓ పాము అకస్మాత్తుగా లోపలికి వచ్చింది. అది చూసిన సిబ్బంది బయటకు పరుగెత్తుకొచ్చారు. అనంతరం గ్రామ కార్మికులతో కలిసి పలువురు సిబ్బంది పామును చంపేశారు.

క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుతామని..
– పటాన్‌చెరులో సైబర్ మోసం

పటాన్‌చెరు టౌన్: క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుతామని సైబర్ మోసానికి పాల్పడిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పటాన్‌చెరు శివారులోని కృషి డిఫెన్స్ కాలనీకి చెందిన ఓ ప్రైవేట్ ఉద్యోగినికి 16వ తేదీన అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుతామని నమ్మించారు. దీంతో ఆ ఉద్యోగిని తన వివరాలను అపరిచిత వ్యక్తులకు చెప్పడంతో పాటు తనకి వచ్చిన ఓటీపీని చెప్పింది. వెంటనే ఉద్యోగిని ఖాతాలోని రూ.52 వేలు నగదు డ్రా అయినట్టు మెసేజ్ వచ్చింది. బాధితురాలు వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. రూ.6,300 హోల్డ్ అయినట్టు పోలీసులు తెలిపారు.

సర్కారు కొలువే లక్ష్యంగా..

గ్రంథాలయంతో దోస్తీ.. పుస్తకాలతో కుస్తీ

సర్కారు కొలువు ఎందరో యువత జీవిత లక్ష్యం. ఆ ఆశయాన్ని సాధించాలనే లక్ష్యంతో కాలంతో పోటీ పడుతూ చదువులు సాగిస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేయడంతో నిరుద్యోగుల్లో ఆశలు రేకెత్తాయి. ప్రిపరేషన్ కోసం అందుబాటులో ఉన్న గ్రంథాలయాలకు పరుగులు పెడుతున్నారు. అక్కడ గంటల తరబడి పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. ప్రతి రోజూ 1,300 మందికి పైగా నిరుద్యోగులు చదువుకోవడానికి జిల్లా గ్రంథాలయాలకు వెళ్తున్నారు. – మెదక్‌జోన్


జిల్లా కేంద్ర గ్రంథాలయంలో చదువుకుంటున్న అభ్యర్థులు

- మెదక్ పట్టణంలో రేయింబవళ్లు చదువు
- పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువత
- నెలకు 40 వేల మందికి పైగానే..
- సిబ్బంది కొరతతో అభ్యర్థుల ఇబ్బందులు

జిల్లాలో మొత్తం 18 గ్రంథాలయాలు ఉన్నాయి. వాటిలో 15 శాఖ గ్రంథాలయాలు, 2 గ్రామీణ గ్రంథాలయాలు, ఒకటి జిల్లా గ్రంథాలయం ఉంది. వీటిలో 14 గ్రంథాలయాలకు సొంత భవనాలు ఉండగా, మిగితావి అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేయడంతో పాటు అంతకుముందు జారీ చేసిన ఉద్యోగ నోటిఫికేషన్లతో నిరుద్యోగులు పుస్తకాలను వదలడం లేదు. ఇందులో కాస్త ఆర్థికంగా ఉన్న వారు హైదరాబాద్ లాంటి నగరాలకు వెళ్లి కోచింగ్ తీసుకుంటుండగా.. పేద కుటుంబాలకు చెందిన నిరుద్యోగ యువత మాత్రం దగ్గరిలో ఉన్న గ్రంథాయాలకు వెళ్లి ఉదయం నుంచి సాయంత్రం వరకు చదువుకుంటున్నారు. అలాగే ఇటీవల టెట్, గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షల్లో అర్హత సాధించిన వారు సైతం ప్రిపేర్ అవుతున్నారు.

నిత్యం 1,300 మందికి పైగా..

జిల్లా వ్యాప్తంగా ఉన్న గ్రంథాలయాల్లో నిత్యం 1,300 మందికిపైగా నిరుద్యోగులు చదువుకుంటున్నట్లు రికార్డులు చెబుతున్నాయి. జూలైలో 40,450 మంది నిరుద్యోగులు చదువుకున్నట్లు గ్రంథాలయ సిబ్బంది చెబుతున్నారు. అలాగే గ్రంథాలయాలన్నింటిలో 1.60 లక్షల పుస్తకాలు అందుబాటులో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. రెండేళ్లలో రూ.1.15 లక్షలు వెచ్చించి పుస్తకాలు కొనుగోలు చేసినట్లు సిబ్బంది పేర్కొన్నారు. ప్రతీ నెల రూ.25 వేలు వెచ్చించి బుక్స్ కొనుగోలు చేసేందుకు అవకాశం ఉందని వారు పేర్కొంటున్నారు.



వేధిస్తున్న సిబ్బంది కొరత

గ్రంథాలయాల్లో సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఈ విషయంపై ప్రభుత్వం దృష్టి సారించకపోవడంతో రీడర్స్ ఇబ్బంది పడుతున్నారు. 18 గ్రంథాలయాల్లో మొత్తం 23 సాంక్షన్ పోస్టులు ఉండగా, కేవలం ఏడుగురు మాత్రమే విధుల్లో ఉన్నారు. 16 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇందులో 12 మంది లైబ్రేరీయన్లు ఉండాల్సి ఉండగా.. నలుగురు మాత్రమే ఉన్నారు. నలుగురు రికార్డు అసిస్టెంట్లకు ఇద్దరు మాత్రమే ఉన్నారు. ఇద్దరు వాచ్‌మెన్‌లకు ఒక్కరే ఉన్నారు. ఐదు అటెండర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఫలితంగా ఒక్కో సిబ్బందికి మూడు నాలుగు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. దీంతో వాటి నిర్వహణ అధ్వానంగా తయారైంది. ప్రస్తుతం నిరుద్యోగులు పెద్ద ఎత్తున లైబ్రరీలకు తరలి రావడంతో సిబ్బంది కొరత కారణంగా ఇబ్బందులు తప్పడం లేదు.

గ్రూప్స్‌కు ప్రిపేర్ అవుతున్నా..



ప్రభుత్వం ఉద్యోగ క్యాలెండర్ విడుదల చేయగానే నిత్యం జిల్లా కేంద్రంలోని గ్రంథాలయానికి వస్తున్నాను. గ్రూప్స్‌కు ప్రిపర్ అవుతున్నాను. ఇంటి నుంచే బుక్స్ తెచ్చుకొని ఇక్కడ చదువుకుంటున్నాను. ఇక్కడ కూడా కాంపిటేషన్ బుక్స్ అందుబాటులో ఉన్నాయి. అవసరమైన బుక్స్ అడిగితే ఇస్తున్నారు.
– సాయి, రామాయంపేట

ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యం..



నేను డిగ్రీ పూర్తి చేశా. ప్రభుత్వ ఉద్యోగం కోసం నెల రోజులుగా ప్రిపేర్ అవుతున్నా. నిత్యం గ్రంథాలయానికి వచ్చి చదువుకుంటున్నాను. ఇక్కడ ఉన్న బుక్స్‌ను బయటకు ఇవ్వడం లేదు. ఇక్కడే చదువుకొని వెళ్లాల్సి వస్తోంది.
– మహేశ్, మెదక్

బుక్స్ తెప్పిస్తున్నాం

గ్రంథాలయాలకు వచ్చి చదువుకునే వారి కోసం కోరిన బుక్స్ తెప్పిస్తున్నాం. పుస్తకాల కొనుగోలు కోసం ప్రతీ నెలా రూ.25 వేలు వెచ్చిస్తున్నాం. రెండేళ్లలో రూ. 1.15 లక్షల వ్యయంతో పుస్తకాలు కొనుగోలు చేశాం. నిరుద్యోగులకు అన్ని పుస్తకాలు అందుబాటులో ఉండేలా చూస్తాం.
– వంశీకృష్ణ, గ్రంథాలయ ఇన్‌చార్జి సెక్రటరీ

మరణంలోనూ వీడని స్నేహం

- చెరువులో మునిగి ఇద్దరు మృతి
- మేనమామ గృహ ప్రవేశానికి వచ్చి మృత్యుఒడిలోకి..
- కొండపాక మండలం సిర్సనగండ్లలో విషాదం


హేమంత్, నిఖేష్ మృతదేహాలు


ఊర చెరువు వద్ద రోదిస్తున్న కుటుంబీకులు, గుమిగూడిన గ్రామస్తులు

కొండపాక(గజ్వేల్): మరణంలోనూ స్నేహబంధం వీడలేదు. శుభకార్యానికి వచ్చిన ఇద్దరు స్నేహితులు చెరువులో మునిగి మృతి చెందారు. ఈ ఘటన కొండపాక మండలం సిర్సనగండ్లలో బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన సముద్రాల ఆంజనేయులు ఈనెల 23న గృహ ప్రవేశ కార్యక్రమం ఉంది. ఈ మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందులో నివాసం ఉంటున్న ఆంజనేయులు బామ్మరిది మల్లేశం తన కుటుంబ సభ్యులు సిర్సనగండ్లకు వచ్చారు. మల్లేశం కుమారుడు హేమంత్ స్నేహితుడైన నిఖేష్‌వర్ధన్ వీరి ఇంటి పక్కనే ఉంటున్నాడు. గృహ ప్రవేశానికి అతడు కూడా వెంట వచ్చాడు. కాగా, ఆంజనేయులు చిన్న కుమారుడు అరుణ్, బి.హేమంత్(16) అతడి స్నేహితుడు నిఖేష్ వర్ధన్, (13) కలిసి గ్రామంలోని ఊర చెరువులో మధ్యాహ్నం ఈత కోసం వెళ్లారు. ముగ్గురు కలిసి ఈత కొడుతుండగా.. హేమంత్, నిఖేష్ నీటిలో మునిగిపోతుండగా.. గమనించిన అరుణ్ కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం దక్కలేదు. కేకలు వేయడంతో చెరువుకు సమీపంలో వ్యవసాయ కూలీలు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే ఇద్దరు పిల్లలు చెరువులో మునిగిపోయారు. మృతదేహాలను వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గ్రామంలో విషాదచాయలు అలుముకోగా, ఆంజనేయులు గృహ ప్రవేశ కార్యక్రమం ఆగిపోయింది. కేసు దర్యాప్తులో ఉంది. మృతుల్లో హేమంత్ ఇంటర్, నిఖేష్ ఎనిమిదవ తరగతి చదువుతున్నారు.

అరుదైన ఆపరేషన్

మహిళ కడుపులో నుంచి గాల్ బ్లాడర్, రాళ్లు తొలగింపు


ఆపరేషన్ చేసిన వైద్య బృందం


తొలగించిన గాల్ బ్లాడర్

దుబ్బాక: దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ హేమరాజ్ సింగ్ ఆధ్వర్యంలో బుధవారం వైద్యులు అరుదైన ఆపరేషన్ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. దుబ్బాక మండలం హబ్షీపూర్‌కు చెందిన మల్లీ కళావతి 6 నెలలుగా తీవ్ర కడుపునొప్పితో బాధ పడుతోంది. వైద్యం కోసం దుబ్బాక ఆస్పత్రికి రాగా పరీక్షించిన వైద్యులు బిగ్ సైజ్ గాల్‌బ్లాడర్‌తో పాటు మల్టీపుల్ రాళ్లు ఉన్నట్లు గుర్తించారు. సర్జరీ చేసేందుకు పరీక్షలు చేయగా ఆమెకు రక్తం చాలా తక్కువగా ఉంది. 3 యూనిట్ల రక్తం ఎక్కించి వైద్యబృందం గంటకు పైగా శ్రమించి ఆరోగ్యశ్రీ పథకం కింద విజయవంతంగా ఆపరేషన్ చేశారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యంగానే ఉందని డాక్టర్ హేమరాజ్‌సింగ్ తెలిపారు. ఆపరేషన్‌లో డాక్టర్లు రఘు., అలేఖ్యానాయుడు, రాఘవేందర్‌తో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'కొత్త ఆలోచనలతో ముందుకెళ్లాలి'

నర్సాపూర్: కాలేజీలో ఉన్న వనరులు, అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని కొత్త ఆలోచనలకు రూపం ఇవ్వాలని శ్రీవిష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి ఆదిత్య విస్సామ్ అన్నారు. సొసైటీ ఆధ్వర్యంలో నర్సాపూర్‌లో కొనసాగుతున్న బీవీ రాజు ఇంజనీరింగు కాలేజీలో బుధవారం ప్రథమ సంవత్సరం విద్యార్థులు, తల్లిదండ్రులతో పరిచయ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన విస్సామ్ మాట్లాడుతూ.. నర్సాపూర్‌లోని తమ కాలేజీ రాష్ట్రంలో 9వ స్థానంలో ఉందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు అధునాతన ల్యాబరేటరీలు, లైబ్రరీ సదుపాయాలు ఉన్నాయన్నారు. ప్లేస్‌మెంట్‌లో సైతం కాలేజీ ముందు వరుసలో ఉందన్నారు. సొసైటీ వైస్ చైర్మన్ రవిచంద్రన్ రాజగోపాల్ మాట్లాడుతూ.. తమ పిల్లలను ఇతరులతో పోల్చడం కన్న ప్రాజెక్టుల ద్వారా వాస్తవ ప్రపంచ అనుభవాన్ని పొందడంలో తల్లిదండ్రులు మద్దతు ఇవ్వాలని సూచించారు.అనంతరం కాలేజీ సావనీర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంజయ్‌దూబె, డైరెక్టర్ లక్ష్మిప్రసాద్, డీజీఎం కాంతారావు, మేనేజర్ బాపిరాజు, ఏటలు సురేశ్, అశోక్‌రెడ్డి, హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.

ప్రేమ వివాహం చేసుకుందని..

ఉరి వేసుకొని తండ్రి ఆత్మహత్య


రాజు (ఫైల్)

హుస్నాబాద్‌రూరల్: ఉరి వేసుకొని రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్) గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. అక్కన్నపేట మండలం తెనుగుపల్లెకు చెందిన రైతు కాటవేని రాజు(50) గౌరవెల్లి ప్రాజెక్టులో భాగంగా భూము లు కోల్పోవడంతో పోతారం(ఎస్) శివారులోని కాలనీలో ఉంటున్నాడు. రాజు చిన్న కూతురు ఐదురోజుల కిందట బంధువుల అబ్బాయిని ప్రేమ వివాహం చేసుకొంది. మంగళవారం కూతురు తిరిగి ఇంటికొచ్చింది. నాకు నచ్చని పెళ్లి చేసుకొని పరువుతీశావని మనస్తాపంతో ఇంట్లో నుంచి వెళ్లిపోయి హనుమాన్ దేవాలయం ఎదుట చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య సరోజన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని మెలగిరిపేట్ శివారులో బుధవారం చోటు చేసుకుంది. సదాశివపేట సీఐ మహేశ్ కథనం మేరకు.. ఏపీలోని తూర్పు గోదావరి జిల్లా, ఆత్రేయపురం గ్రామానికి చెందిన తెన్నెస నాగరాజ్(44) సదాశివపేట మండలంలోని మెలగిరిపేట్ శివారులో ఓ వ్యక్తి వద్ద భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. వ్యవసాయ సాగు, కుటుంబ అవసరాలకు అప్పులు చేశాడు. ఆర్థికంగా ఇబ్బందులు తలెత్తి మనస్తాపంతో వ్యవసాయ పొలం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గుర్తించిన స్థానికులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బైక్ అదుపుతప్పి.. కరెంట్ పోల్‌ను ఢీకొట్టి

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


ఘటనా స్థలంలో స్వామి మృతదేహం

సిద్దిపేటకమాన్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన జిల్లా కేంద్రం సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. సిద్దిపేట వన్ టౌన్ సీఐ లక్ష్మీబాబు కథనం మేరకు.. చిన్నగుండవెల్లి గ్రామానికి చెందిన గుర్జకుంట స్వామి (31)కి అదే గ్రామానికి చెందిన శ్వేతతో 2019లో వివాహం జరుగగా నాలుగేళ్ల కూతురు ఉంది. కుటుంబ కలహాలతో కొంత కాలంగా స్వామి విడిగా ఉంటున్నాడు. స్వామి బుధవారం తెల్లవారు జామున బైక్‌పై సిద్దిపేట ప్రభుత్వాస్పత్రి వైపు నుంచి ముస్తాబాద్ చౌరస్తా వైపు వెళ్తున్నాడు. బైక్‌ను అజాగ్రత్తతో అతివేగంగా నడపడంతో రోడ్డు పక్కన ఉన్న కరెంట్ పోల్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలై స్వామి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య శ్వేత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని పాదాచారి

వర్గల్(గజ్వేల్): గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో పాదాచారి మృతి చెందాడు. ఈ ఘటన వర్గల్ మండలం గౌరారం రాజీవ్ రహదారిపై మంగళవారం అర్ధరాత్రి చేసుకుంది. గౌరారం ఎస్సై కరుణాకర్‌రెడ్డి కథనం మేరకు.. గజ్వేల్‌కు చెందిన చిక్కుడు కిరణ్(30) మరి కొందరితో గౌరారంలో ఫ్లెక్సీలు కట్టేందుకు వచ్చాడు. మంగళవారం అర్ధరాత్రి 1.45 గంటల ప్రాంతంలో ఫ్లెక్సీలు పట్టుకొని రాజీవ్‌రహదారిపై కిరణ్ నడుచుకుంటూ వెళ్తుండగా ప్రజ్ఞాపూర్ వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

కారు ఢీకొని వృద్ధుడు

కంగ్టి(నారాయణఖేడ్): రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందిన ఘటన కంగ్టి మండలం తుర్కవడ్‌గాం గ్రామ శివారులో బుధవారం చోటు చేసుకొంది. ఎస్ఐ విజయ్ కుమార్ కథనం మేరకు.. మండలంలోని గాజుల్‌పాడ్ గ్రామానికి చెందిన మాల లక్ష్మణ్(62) కూతురు రేణుక గ్రామమైన తుర్కవడ్‌గామ్‌కు వచ్చాడు. తిరిగి నడుచుకుంటూ వెళ్తుండగా తుర్కవడ్‌గామ్ సమీపంలో రాజ్ దాబా వద్ద కారు ఢీకొట్టింది. తీవ్రగాయాలైన అతడిని ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మృతి చెందాడు. మృతుడి కుమారుడు గౌతం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

చెరువు కాలుష్యం.. మత్స్యకారులకు శాపం

సంగారెడ్డిలో చేపలు మృత్యువాత..

- సుమారు రెండు లక్షలపైగానే..
- మహబూబ్‌సాగర్ చెరువును సందర్శించిన మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి


మహబూబ్ సాగర్ చెరువులో మృత్యువాత పడిన చేపలు

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి పట్టణంలోని మహబూబ్‌సాగర్ చెరువులో కాలుష్య జలాలు, ఆక్సిజన్ లెవల్ పడిపోవడంతో చేపలు మృత్యువాత పడుతున్నాయి. బుధవారం తెల్లారేసరికి చెరువులో ఒక్కసారిగా చేప పిల్లలు మృతి చెంది కనిపించాయి. సుమారు రెండు లక్షలకు పైగా మృతి చెందాయని, పట్టణంలోని కాలుష్య జలాలు చెరువులోకి వదలడంతోనే చనిపోయినట్లు మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. దీంతో జీవనోపాధి కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు.

మత్స్య కుటుంబాలను ఆదుకుంటాం

చేపలు మృత్యువాత పడిన విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఘటనా స్థలానికి చేరుకున్నారు. జీవనోపాధి కోల్పోయిన మత్స్యకారుల కుటుంబాలన్ని అన్ని రకాలుగా ఆదుకుంటామని భరోసానిచ్చారు. మహబూబ్ సాగర్ చెరువును పరిశుభ్రం చేసి చేపలు పెంచుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని స్థానిక అధికారులను ఆదేశించారు.

జీవనోపాధిని కోల్పోయాం



చెరువులో చేపలు పట్టుకొని జీవనం సాగిస్తూ ఉంటాం. నీరు కాలుష్యంతో సుమారు రెండు లక్షల పైగా చేపలు చనిపోవడంతో దీనిపైన ఆధారపడ్డ మాకు జీవనోపాధి లేకుండా పోయింది. చెరువులు కాలుష్యం కాకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలి. ఆర్థికంగా మమ్మల్ని ఆదుకోవాలి.
– అంజనేయులు, మత్స్యకారి

మత్స్యకారులను ఆదుకోవాలి



కాలుష్య నీటితో చెరువులోని చేపలు మృత్యువాతపడ్డాయి. దీంతో మత్స్యకారులకు ఆర్థికంగా ఇబ్బంది ఏర్పడింది. ప్రభుత్వమే మత్స్యకారులను ఆదుకోవాలి. ప్రతిరోజు చేపలు పట్టుకొని జీవనం సాగించే వారు ఉపాధి కోల్పోయారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలి.
– నగేశ్, సంగారెడ్డి మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు

తిమ్మాపూర్ గ్రామంలో..

జగదేవ్‌పూర్(గజ్వేల్): చెరువులో నీళ్లు కలుషితం కావడంతో చేపలు మృత్యువాత పడిన ఘటన మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామంలోని గుండారెడ్డి చెరువులో గతేడాది లక్షకు పైగా వేశారు. అదే ఏడాది కొన్ని చేపలు పట్టారు. ఇటీవల కురిసిన వర్షానికి చెరువు నిండింది. బుధవారం ఉదయం చెరువు వైపు వెళ్లిన గ్రామస్తులకు చెరువులో చేపలు మృతి చెంది కనిపించాయి. పక్కన ఉండే కోళ్ల ఫారమ్ నుంచి వచ్చే కలుషితమైన నీరు చెరువులో కలువడంతోనే చేపలు మృతి చెందాయని గ్రామస్తులు ఆరోపించారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామ కార్యదర్శికి వినతిపత్రం అందించారు.


మృతి చెందిన చేపలు

రెండు బైక్‌లు ఢీ

చిన్నశంకరంపేట(మెదక్):రెండు బైక్‌లు ఢీకొని ఒకరు మృతి చెందారు. నార్సింగి ఎస్ఐ అహ్మద్ మోహినోద్దీన్ కథనం మేరకు.. వల్లాభాపూర్ తండాకు చెందిన నేనవత్ మంత్యా(44) బైక్‌పై నార్సింగ్‌కు వెళ్తున్నాడు. చేగుంటకు చెందిన మరో వ్యక్తి బైక్‌పై నార్సింగ్‌కు వెళ్తున్నాడు. నార్సింగి సర్వీస్ రోడ్డులోకి రాగానే రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మంత్యా అక్కడికక్కడే మృతి చెందగా మరో వ్యక్తికి తీవ్రంగా గాయాలు అయ్యాయి. క్షతగాత్రుడిని రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చేపల వేటకు వెళ్లి మృతి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి చెందాడు. సదాశివపేట సీఐ మహేశ్ కథనం మేరకు.. మండల పరిధిలోని తంగడపల్లి తండా గ్రామానికి చెందిన సభవత్ పాండు (41) వ్యవసాయ కూలీగా పని చేసుకుంటూ అప్పుడప్పుడూ చేపల వేటకు వెళ్తుండేవాడు. ఈనెల 19న చేపల వేటకు వెళ్లి వస్తానని ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, తెలిసిన వారి వద్ద వెతికినా జాడ దొరకలేదు. చేపలు పట్టే క్రమంలో రాళ్లలో ఇరుక్కుపోయి మృతి చెంది బుధవారం ఉదయం చెరువులో మృతదేహమై తేలాడు. అటుగా వెళ్లిన స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.